# పందిరి

"నాన్నా! మీదిపెద్దలు చేసిన పెళ్ళా? ప్రేమ వివాహమా?"

ఉన్నట్టుండి ఏ తూటాయో వచ్చి, వళ్ళోపడితే తుళ్ళిపడ్డట్టు కూతురు అపర్ణ వేసిన ఆ ప్రశ్నకి రామారావు ఉలిక్కిపడ్డాడు. వెంటనే తెల్లబోయాడుకూడా.

పట్టుమని పదహారేళ్ళు నిండని పసిపాప తన అపర్ణేనా, ఈ ప్రశ్న వేసింది? దీనికసలు పెళ్ళి ఆలోచన ఎలా వచ్చింది? హాయిగా గెంతుతూ తుళ్ళుతూ ఆడుకుంటూ చదువుకుంటూ కేరింతలు కొడుతూ కాలక్షేపం చెయ్యవలసిన వయస్సు!

"నాకు ఫలానా పుస్తకం కావాలి!

ఇంటర్‌లో రేంక్ రావాలంటే, తర్వాత ఎమ్‌సెట్‌లో సెలెక్ట్ కావాలంటే, ఫలానా ట్యూటోరియల్ కాలేజీలో చేరి, ఫలానా లెక్చరర్ దగ్గర ట్యూషన్‌కి చేరాలి. నాటెన్నీస్ రేకెట్‌గెట్ తెగిపోయింది' వేయించాలి. నాకీ కలర్ చుడీదార్ పైజమా కావాలి. ఈ స్కర్ట్‌లో ఎలా ఉన్నాను నేను!"

– అంటూ, ఏవో చిన్నారి చిలిపి కబుర్లు చెప్పే అపర్ణేవిటి, పెద్ద ఆరిందాలా, ఈ పెళ్ళి ప్రశ్నలేవిటి?

ఓ కాలికి సాక్స్ వేసుకుని, మరోకాలిసాక్స్ చేత్తో ఆమట్టునే పట్టుకుని ఉండిపోయి, కూతురుకేసి తెల్లబోయి చూశాడు రామారావు.

"చెప్పునాన్నా! మీది ఏరకం పెళ్ళి?" అంటూ మళ్ళీ మళ్ళీ అడగసాగింది అపర్ణ.

చేతిలో ఉన్న సాక్స్ దులిపి రెండో కాలికి వేసుకుని, బూట్లలో కాళ్ళు

పెడుతూ, "ఏదో రకం! ఎందుకదంతా ఇప్పుడు?" - కాస్త ఉదాసీనంగా, మరికాస్త విసుగ్గా అన్నాడు రామారావు.

"చెప్పు - చెప్పమంటుంటే .... సమాధానం చెప్పకుండా నువ్వు ఆఫీసుకి వెళ్ళడానికి వీల్లేదు. వెళ్ళనివ్వను" అంటూ లేచివెళ్ళి గుమ్మానికి అడ్డంగా రెండు చేతలూ పెట్టి నిలబడింది అపర్ణ.

"ఏవిటి చెప్పేది? అడ్డంలే - ఆఫీసుకి వెళ్ళాలి. ఇప్పటికే ఆలశ్యం అయింది."

హాల్లోంచి భర్తగొంతు గట్టిగా వినిపించడంతో, సీతామహాలక్ష్మి ఉరఫ్ సీతాదేవి, వంటింట్లోంచి వచ్చి, "ఏవిటీ, ఏమైందీ?" అనడిగింది.

కనుబొమలు చిట్లించి, "ఏవిటా? దాన్నే అడుగు. మనపెళ్ళట! ప్రేమ పెళ్ళా, పెద్దలు చేసిందా అని అడుగుతోంది" అంటూ కూతురు చేతులు తప్పించి, స్కూటర్ తీసుకుని, విసురుగా వెళ్ళిపోయాడు రామారావు.

"ఏవిటే అమ్మాయ్! నాన్నగారిని ఏవిటి అడుగుతున్నావ్?" అంటూ నవ్వుతూ పలకరించినా, సీతాదేవికి విసురైన సమాధానమే వచ్చింది కూతురు దగ్గర్నుంచి, 'ఏమీ లేదు' అంటూ.

"నన్ను అడక్కూడదూ? నే చెప్తాగా"

"అడిగినప్పుడు చెబుదువుగానిలే".

ఎంతముభావంగా అన్నా, అపర్ణగొంతులో నిర్లక్ష్యం విసుగూ, కోపం, ధ్వనించనే ధ్వనించాయి. చరచరా తన స్టడీరూమ్‌లోకి వెళ్ళి తలుపువేసుకుంటూన్న కూతుర్ని చూసి, భారంగా నిట్టూర్చింది సీతామహాలక్ష్మి.

ఏవిటో ఈమధ్య అయిదారు నెలలనుంచి ఇలా తయారైంది. ఏక విసుగూ, కోపం 'అదేం' అంటే చురచురలాడుతూ చూడ్డం. గంటల తరబడి మూతి బిగించుకొని మాట్లాడకపోవడం.

"ఈ పువ్వులు పెట్టుకో"

"ఉహుఁ!"

"ఈ గాజులు వేసుకో"

"వద్దు"

"సినిమాకి వెళ్దామా?"

"మీరు వెళ్ళండి"

"ఇవాళ పండగ – నేనీ కొత్తచీర కట్టుకుంటాను, నువ్వా చుడీదార్ వేసుకో".

"అఖ్ఖర్లేదు–"

ఇదీ తంతు. మాట్లాడితే చాలు అంతెత్తున ఎగిరిపోతోంది.

ఏవిటో – ఇప్పటి పిల్లలూ – పిల్లల మనస్తత్వాలూ!

ఇంటి పనులు చేసుకుంటోంది కాని సీతాదేవికి అపర్ణ గురించి ఆలోచనలే!

శీను పుట్టిన పదేళ్ళకి కాని తనకడుపు మళ్ళీ ఫలించలేదు.

'ఆడపిల్ల' అన్నప్పుడు తన మనస్సు ఎంత సంతోషంతో గెంతులేసింది? ఆయన మాత్రం! "మా యింటి మాలక్ష్మి, బంగారు తల్లి!" అంటూ ఎత్తుకు ఒక్క క్షణం దింపారా? పెద్దయ్యాకమాత్రం? ఏది అడిగితే అది కొనిపెడుతూ, కళ్ళల్లో పెట్టుకుని చూసుకుంటున్నారే!

కంప్యూటర్ ఇంజనీరింగ్ చదివి, ఆ శీనుగాడు అమెరికావెళ్ళిపోయి, తమకి మాటమాత్రమేనా చెప్పకుండా అక్కడే ఓ అమ్మాయిని పెళ్ళిచేసుకుని తమకి ఫోను చేస్తే, ఆయన ఏం అన్నారు?"

"ఛీ .... వాడెలా పోతేపోనీ – వాడు నా కొడుకు కానేకాదు – అపర్ణే నా కొడుకు! ఇదే మనకి అన్నీను. ఇంజనీర్ అయినా, డాక్టరైనా, కలెక్టరయినా దాని ఇష్టం. ఏది కావాలంటే అది చదివిస్తాను. నాకు ఇంకా పదేళ్ళ సర్వీసు ఉంది. అపర్ణ అంటే ఎవరు? మన కంటి వెలుగు! మన ఇంటి దీపం!"

ఇలా ఆయనేకాదు. తను కూడా శీనుని మరిచిపోయి, అపర్ణమీదే అన్ని ఆశలూ పెట్టుకుని, అల్లారు ముద్దుగా పెంచుకుంటోంటే –

– ఇదేవిటి, ఇలా చిర్రుబుస్సులాడ్డం మొదలెట్టింది?

ఈమాటే అంది, రాత్రి రామారావు, వీపు వెనకాల రెండు పెద్ద తలగడలూ అడ్డు వేసుకుని, ఏటవాలుగా నడ్డి వాల్చి పడుకున్నప్పుడు, మంచం అంచున కూర్చుని తామల పాకులు చిలకలుగా చుట్టి అతని నోటికి అందిస్తూ.

"ఏదో చదువుభారం! అలసటా విసుగూను. అసలు ఇప్పటి ఇంటర్మీడియేట్ సిలబస్ ఎంత ఉందని? రేంక్ రావాలంటే, రోజుకి పదహారు గంటలు చదివినా చాలదు....."

"అలాగని మనమీద విసుక్కోవడం ఏవిటీ? ఇదొక్కటే చదువుతోందా? ఎంతమంది చదవడంలేదూ రోజుకి పదిహేను పదహారు గంటలు కష్టపడి?"

"ఏదో పోనిద్దూ! ..... చిన్నపిల్ల!"

"పదహారు నిండి పదిహేడు వస్తూంటే, అది చిన్నపిల్లా? నా కీ ఈడుకి శీను, కడుపున పడ్డాడు, తెలుసా?

"ఆరోజులు వేరూ - అప్పుడు పన్నెండు పదమూడేళ్ళకే ఆడపిల్లలకి పెళ్ళిళ్ళు చేసేవారు. సర్లే. అవతలిగదిలో అపర్ణ చదువుకుంటోందో పడుకుందో చూసివచ్చి లైటు ఆర్పు" అన్నాడు రామారావు.

సీత వెళ్ళింది. తీరా చూస్తే అపర్ణ చదువుకుంటూనూ లేదు, పడుకోనూ లేదు. హాల్లో నైట్ బల్బ్ వెలుగులో సోఫాలో కూర్చుని, పైన తిరుగుతూన్న సీలింగ్ ఫేన్‌కేసి చూస్తోంది.

సీతామహాలక్ష్మి ట్యూబ్‌లైట్ వేసి కూతురు దగ్గరికి వెళ్ళి, "ఇదేవిటే తల్లీ! ఇక్కడ కూర్చున్నావ్! చీకట్లో? నిద్దరపోలేదా?" అంది.

అపర్ణ తల్లికేసి అదో మాదిరిగా చూసింది.

"కళ్ళు ఎర్రగా ఉన్నాయేమిటి? తలనొప్పి జ్వరంగాని రాలేదు కదా!" అంటూ చెయ్యి నుదురుమీద వెయ్యబోయింది సీతాదేవి.

ఆమె చేతిని విసిరికొడుతూ, "నాకేం కాలేదు" అంది అపర్ణ.

"అయినా ఉండు - మీ నాన్నని పిలుస్తాను. ఏవండీ!"

"నువ్వు అరవకు. నాకేం కాలేదని చెప్పాను కదా. నువ్వెళ్ళి పడుకో!" అంటూ కస్సుమంది అపర్ణ.

"నువ్విం హాల్లో ఫేన్‌కేసి చూస్తూ నిద్దరపోకుండా కూర్చుంటే నేను వెళ్ళి పడుకోనా?" సీతకూడా గట్టిగానే అంది.

"సరే. నేను నా గదిలోకి వెళ్తాను. నువ్వు నీ గదికి వెళ్ళు. ఘడియేసుకుని పడుకో."

ఇలా అన్న అన్ని మాటల్లోను 'ఘడియ' అన్న పదాన్ని మాత్రం నొక్కి పలకడాన్ని సీతాదేవి గమనించకపోలేదు.

"దాని వరస చూస్తే నాకేవిటో బెంగంగా ఉందండీ" అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకుంది సీత.

"ఛ .... ఎందుకు బెంగ? ఏదో చిన్నతనం ... పోనిద్దూ" అంటూ రామారావు ఆమె కన్నీళ్ళు తుడిచి, దగ్గరగా తీసుకున్నాడు.

అయినా సీతామహాలక్ష్మి మనస్సులో భయం భయంగానే మిగిలిపోయింది.

ఆ తర్వాత వారం పదిరోజుల వరకూ ఇంట్లో గంభీర వాతావరణం. ఎవరితో ఎవరూ సరదాగా మాట్లాడుకోలేదు. అవసరం ఉన్నంత వరకే ఏవో పొడి ముక్కలు.

ఎదురైతే పలకరింపులూ
పెదాల మీద చిరునవ్వులూ
గుండెల్లో ఆత్మీయతలూ
ఇవన్నీ ఏమయ్యాయో!

మూకీ బొమ్మల్లా కదులుతున్నారు, ముగ్గురూ ఆయింట్లో. పరిస్థితి ఇబ్బందిగానూ ఇరకాటంగానూ ఉంది.

దాన్ని సరళంచేసి, తిరిగి సరదా వాతావరణం కల్పించడానికి, ఓరోజు, ఆదివారం మధ్యాహ్నం, హాల్లో కూర్చున్న రామారావు హఠాత్తుగా, గొంతెత్తి "అమ్మా అపర్ణా! ఓ సీతామహాలక్ష్మీ! ఇద్దరూ అర్జంటుగా ఇటురావాలి!" అంటూ కేకేశాడు.

అపర్ణ వచ్చి టేబిల్ అంచున బొట్టమోపుగా కూచుంది.

సీత అయితే సోఫాలో నెమ్మదిగా వాలింది.

"ఏవిటీ?" అన్నట్టు ఇద్దరూ రామారావుకేసి ప్రశ్నార్థకంగా చూశారు.

"వినండి" అంటూ రామారావు మొదలుపెట్టాడు.

"మనం అనుకున్న ట్యుటోరియల్ కాలేజీలో అపర్ణకి సీటు వచ్చింది. పొద్దున్న రెండు గంటలూ సాయంత్రం గంటన్నరా లెఖ్ఖలూ సైన్సూ చెప్తారు. మన అమ్మాయికి ఇంటర్ ఫస్టియర్‌లో వచ్చిన మార్కులు చూసి, ట్యూషన్ ఫీజు కూడా నెలకి ఐదు వందలు తగ్గించారు. స్పెషల్ కన్సెషన్ కింద నెలకి వెయ్యి ఇస్తే చాలు. ఎమ్‌సెట్‌లో తప్పకుండా రేంక్ వస్తుందనీ, ఇంజనీరింగ్‌లో ముఖ్యంగా కంప్యూటర్ కోర్స్ సీటు గ్యారంటీ అనీ చెప్పారు. ఈ ఏడాదీ, "ఆ నాలుగేళ్ళూ మొత్తం అయిదేళ్ళూ తనూ, మనం శ్రమపడ్డాం అంటే, మన కలలు ఫలిస్తాయి".

ఇలా చెప్తూ అటు కూతురు ముఖంలోకీ, ఇటు భార్య కళ్ళల్లోకీ చూశాడు రామారావు.

సీత కళ్ళు సంతోషంతో జిగేల్ మన్నాయి.

అపర్ణ ముఖంలో చైతన్యం ఏం కన్పించలేదు.

ఉదాసీనంగా ఉండిపోయిన కూతురుకేసి చూసి, "ఏం అమ్మా – అలా ఉన్నావు? ఈ కబురు విని ఎగిరిగంతేయవలసింది పోయి, గతుక్కుమని ఉండి పోయావు." ఆదుర్దాగా అడిగాడు రామారావు.

సీతాదేవి కూడా కూతురుకేసి తెల్లబోయి చూసింది.

"చెప్పమ్మా! చెప్పు – నీ మనస్సులో ఉన్నదేదో చెప్పు. మౌనంగా ఉండిపోతే ఎలా?"

"అదేం చెప్తుందండీ. దానికేం తెలుసూ? చిన్నపిల్లా ....."

"ఆమాటే అనొద్దన్నాను. నాకు పదహారేళ్ళు నిండాయి. చిన్నపిల్లట! చిన్నపిల్ల!"

కస్సు మంది అపర్ణ.

సీతా, రామారావు ఇద్దరూ తెల్లబోయారు. ఒక్క క్షణం ఆగి, "అమ్మ అలా అందని కోపం ఎందుకు తల్లీ! పదహారు కాదు. ఇంకో రెండు పదహార్లు వచ్చినా నువ్వు మాకు చిన్నపిల్లవే" అన్నాడు రామారావు.

"ఇంక అటువంటప్పుడు నన్ను అడగడగం దేనికి? మీ ఇష్టం వచ్చినట్లు కానియ్యండి".

విసురుగా లేచింది.

"అలా కాదు – కూచో. నీ ఉద్దేశం ఏవిటో చెప్పు. చెప్పుతల్లీ! ... చెప్పమంటూంటే .... ఊ ....."

"నేనీ ఎమ్‌సెట్‌లూ ఇంజనీరింగులూ చదవను".

"చద .... వ ..... క?"

"నువ్వుండవే – దాన్ని చెప్పనీ"

రామారావూ, సీతా, నిశ్శబ్దంగా అపర్ణకేసి చూస్తూ ఉండిపోయారు.

అపర్ణ ఇద్దరికేసి మార్చి మార్చి చూసి తర్వాత తలవంచుకుని నెమ్మదిగా అంది "నేను హోమ్ సైన్స్ చదువుతాను" అని.

సీతాదేవీ రామారావు ఆమాట విని గతుక్కుమన్నారు. చాలా సేపటి వరకూ తెల్లబోయి చూడ్డమే! నోటమాట రాలేదు.

కాస్సేపయ్యాక, సీతామహాలక్ష్మి అంది, "హోమ్ సైన్స్ ఏం ఖర్మనీకు?"

"ఖర్మేవిటి? అది నాకు ఇష్టం".

"ఇష్టం అయితే సరే. కాని దాని ఫ్యూచర్ ఏవిటో ఆలోచించావా?"

తండ్రి కంఠంలో వ్యంగ్యం, వెటకారం, గమనించింది. కాని లెఖ్ఖ చెయ్యలేదు అపర్ణ. దృఢంగా అంది. "ఫ్యూచరో, ప్రజంటో – నాకా కోర్సు ఇష్టం".

"అందరూ కంప్యూటర్ ..... కంప్యూటర్ అంటూ అమెరికాకి పోవాలని ఎగబడుతూంటే, నూటికి ఎనభై తొంభయి మార్కులు వస్తూ, అన్ని అర్హతలూ ఉండి, నువ్వు నాకా కోర్సు వద్దు అనడం ఏవిటి?" – లోపల అనుకున్నట్లుగా పైకే అన్నాడు రామారావు.

"ఏవిటేవిటి? అదృష్టం అందలం ఎక్కించబోతే బుద్ధి బురదలోకి ఈడ్చిందట ..... అలా ఉంది అమ్మాయి సంగతి".

తల్లికేసి వెటకారంగా చూసి, "అహా! మరి ఆ అందలం ఏదో ఎక్కక, వచ్చి వచ్చి నువ్వీ సంసారంలోఎందుకు పడ్డావే అమ్మా!" అనడిగింది అపర్ణ.

"మా కాలంలో ఈ చదువులూ కంప్యూటర్ కోర్సులూ ఉన్నాయా ఏమైనానా? ఎంత సేపటికీ పిల్ల పెద్దదైపోతోంది, పెళ్ళి చేసెయ్యాలని కంగారే పెద్దాళ్ళకి–"

"చదువులూ అవీ ఉంటే, చదువుకొని ఉద్యోగం చేస్తూ అలా ఉండిపోయేదానివా, పెళ్ళి చేసుకోకుండా?"

"అదేం ప్రశ్న? ఎప్పటికేనా పెళ్ళి తప్పదు"

"అవును కదా!" అంటూ పకపకా నవ్వి, చప్పట్లుకొడుతూ వెళ్ళిపోయింది అపర్ణ.

అపర్ణ ఆంతర్యం అర్థంకాక, ఒకరికేసి ఒకరు చూస్తూ తెల్లబోయి కూర్చుండిపోయారు సీతా రామారావులిద్దరూ.

సీతామహాలక్ష్మీ, శ్రీరామారావూ, తమ ఆవలూ కోర్కెలూ తగ్గించుకొని ఎవరి

తలరాత ఎలా ఉంటే అలా అవుతుందని మనస్సులో సర్దుకుని స్థిమిత పడ్డానికి నాలుగైదు వారాలు పట్టింది.

ఆ నెల్లాళ్ళూ ఇంట్లో ఘర్షణలూ వాదనలూ లేక, వాతావరణం సర్దుమణిగింది.

జెట్ ఇంజన్ల మోతలేకుండా, నీటిమీద నావప్రయాణంలా, సజావుగా చల్లగా సాగుతోంది సంసారం. కోపతాపాలు తగ్గించి, తమ కంటి వెలుగైన అపర్ణ మళ్ళీ నవ్వుతూ తుళ్ళుతూ మామూలుగా ఉంటున్నందుకు రామారావూ సీత, 'హమ్మయ్య!' అంటూ పెద్ద గుండెబరువు తగ్గినట్లు సంతోషించారు.

"దాని ఇష్టం – ఏ కోర్సు చదివితే ఏం?" అని మనస్సు సర్దుకున్నారు కూడా.

కాని వాళ్ళు సర్దుకోలేక పోయింది అపర్ణలో వచ్చిన మార్పు. పూర్వంలా తను చిన్నపిల్లలా ఉండడంలేదు. పెద్ద తరహా వచ్చింది. ఆరిందాలా మాట్లాడుతోంది.

రామారావుతో వాకింగ్‌కీ షికార్లుకీ వెళ్లడం మానేసి, "నువ్వెళ్ళు నాన్నా. నేను అమ్మతో పేరంటానికి వెళతాను" అంటోంది.

"నాకీ చాక్‌లెట్లూ బిస్కెట్లూ ఏవిటి? నేనేం చిన్న పిల్లనా?" అంటోంది.

"నాకీ చుడీదార్లూ స్కర్ట్‌లూ వద్దు. అమ్మలా హాయిగా చీరలు కట్టుకుంటా" అంటోంది.

పూర్వం ఇంట్లో ఏవిటి వీధిలో ఏవిటి, స్థిమితంగా నడిచిందా? ఏక పరుగులూ గెంతులే! ఇప్పుడలా కాదు. ఉండుండి పైట సర్దుకుంటూ నెమ్మదిగా తలవంచుకొని తడబడుతూ నడవడం.

అప్పటిలాగే ఇప్పుడూ రామారావు స్నేహితులు "ఏంబేబీ!" అంటూ చిరునవ్వుతో పలకరిస్తూనే ఉన్నారు. కాని అపర్ణ మాత్రం పూర్వంలాగ అంకుల్ అంటూ చనువుగా ఉండడం లేదు. కొంచెం దూరంలో నిలబడి మాట్లాడుతోంది. అడిగిన వాటికి ముక్తసరిగా సమాధానం చెప్తోంది.

ఎవరేనా, "మన బేబీ ఏవిటి? పూర్వం, లేడిలా గెంతుతూ పరిగెట్టేది. ఇప్పుడు నడకలో ఆ హుందాతనం, నెమ్మదిగా నడవడం. చిత్రంగా ఉందే! ఏవిటిదంతా?" అని అడిగితే, రామారావు కాస్త ఇబ్బందితో, "ఆ ... ఏదో ... మునుపటిలా చిన్నపిల్ల కాదు కదండీ!" అని సర్దిచెప్పవలసివస్తోంది.

స్నేహితులకీ పైవాళ్ళకీ ఏవిటి?

రామారావుకే ఆశ్చరంగా ఉంటోంది ఈ మార్పుఏవిటో!

ఒకటి రెండు మార్లు భార్యతో అన్నాడుకూడా!

సీతామహాలక్ష్మి నవ్వి "మీరూ గమనించారన్నమాట!" అంది.

"ఎందువల్ల అంటావు?" అనడిగాడు రామారావు అమాయకంగా.

"పూర్వంలా ఎలా ఉంటుందండీ! దాని వయస్సు ఎంతో తెలుసా? వచ్చే శ్రావణమాసానికి పద్దెనిమిది వస్తాయి"

"వస్తే .....?"

"వస్తే ఏవిటి? దాని ఈడుకి నేను ఏడాది పిల్లాడి తల్లిని. నాకు పదిహేడో ఏడు నిండకుండానే కదండీ శీను పుట్టింది?" అంటూ పకపకా నవ్వింది సీత.

"కాని మన అపర్ణమాత్రం ఇంకా చిన్నపిల్లేనే ....." అన్నాడు రామారావు.

"అలా అని దాని దగ్గర అన్నారు కనుక! కస్సుమంటుంది. మళ్ళీ ఇంట్లో గొడవలూ - రగడలూను".

"ఏవిటో!" అంటూ తికమకపడి, తలగోక్కుంటూ వెళ్ళిపోయాడు రామారావు.

తర్వాత సంవత్సరాది పండుగనాడు కాబోలు, వేపపువ్వుపచ్చడి పెట్టడం కోసం, "అమ్మా! అపర్ణా! ఎక్కడున్నావు?" అంటూకేకేసింది సీతాదేవి.

"ఇక్కడమ్మా ముందుపెరట్లో" అని జవాబు చెప్పింది అపర్ణ.

"ఇక్కడేం చేస్తున్నావు?" అంటూ, వెళ్ళింది పచ్చడి ఉన్న వెండి గిన్నెతో.

జాజితీగ మొదట్లో, రాలిన ఆకులూ, చేరుకొన్న చిన్న చిన్న రాళ్ళూ తీస్తూ, దానికి పళ్ళెం చేస్తూ, రెండు చేతులూ మట్టి అయిపోతే, నుదుటిమీద పడుతూన్న ముంగురుల్ని అరచేతి వెనక భాగం మణికట్టుతో వెనక్కి తోసుకుంటూ కనిపించింది.

"ఎందుకమ్మా ఈపని నీకు? చేతులు కడుక్కునిరా - వేపపువ్వుపచ్చడి పెడతాను" అంది సీత.

"ఇంకా కాస్త పని ఉంది. పచ్చడి ఇలా నోట్లో వెయ్యి" అంది అపర్ణ.

కొద్దిగా వెల్లకిలా వంగి, నోరు జాపిన అపర్ణ, సీతాదేవి కంటికి పసిపాపలా కనిపించింది.

ఇంకా చిన్నతనం చిలిపితనం పోలేదు అని తనలోతనే నవ్వుకొంది.

"అమ్మా చిన్నప్పుడు ఇలా, గోరు ముద్దలు తినిపించే దానివి కదా. అన్నయ్యకి కూడా ఇలాగే తినిపించావా?"

"ఆ ...."

"అప్పుడు నీ మనస్సుకి హాయిగా ఉండేదా?"

"పురివిప్పిన నెమలిలా పులకింతలతో గంతులేస్తూ..."

"నిజంగా?"

"ఆహా!"

"అప్పుడు నీ వయస్సు ... అదే ... అన్నయ్యని ఎత్తుకొని గోరుముద్దలు తినిపించేటప్పుడు ...?"

"ఎంతోనా? ... పదహారో ... పది ... హేడో!"

"అంటే నా వయసన్నమాట!"

సీతా మహాలక్ష్మి ఉలిక్కి పడింది ఆ మాటకి.

"అసలు నీ పెళ్ళి అయిందే, పదిహేనో ఏట అనుకుంటా..."

"అంత ఎక్కడే తల్లీ! పధ్నాలుగేళ్ళనే అప్పటికి"

"వండర్‌ఫుల్ ... వండర్‌ఫుల్ ... ముందీ సంగతి చెప్పు. మీది పెద్దలు చేసిన పెళ్ళా – ప్రేమ వివాహమా?"

సీతాదేవికి సిగ్గు ముంచుకొచ్చేసింది. తలవంచుకుంది. "చెప్పమ్మా ... చెప్పు – చెప్పవూ?" అంటూ తల్లి గడ్డం పట్టుకుని బతిమాలింది.

"రెండూ ... ను" అంది సీత నెమ్మదిగా.

"అంటే?"

"బంధువుల ఇంట్లో పెళ్ళిలో మీ నాన్న నన్ను చూశారు. ఆయన్ని చూశాను. నన్ను పలకరించారు కూడా. ఆ పెళ్ళిలోనే మాపెద్దలు మాపెళ్ళి నిశ్చయ తాంబూలాలు తీసుకున్నారు."

"ఇంకేం? పధ్నాలుగో ఏటే నువ్వు ప్రేమలో పడ్డావన్నమాట ... భలే అదృష్టం

అమ్మా .... భలే ... మీదీ టీనేజ్‌లవ్" అంటూ అపర్ణ, ఆ మట్టిచేతుల్తోటే చప్పట్లు కొట్టింది.

అప్పటికికాని సీతామహాలక్ష్మి, కలల లోకంలోంచి తేరుకోలేదు. తేరుకొని కాస్త కోపం మరికాస్త నవ్వూ కలబోసి, "హాసి భడవా! కబుర్లలో పెట్టి ఎన్ని వాగించావే, నా చేత!" అంది.

ఆ సమయంలో రామారావు అక్కడికి వచ్చాడు. వచ్చి, కూతురు చేతులు రెండూ మట్టిగా ఉండడం చూసి, "ఏవిటమ్మా ఇదీ? ఏం చేస్తున్నావు?" అనడిగాడు.

అపర్ణ తడబడుతూ, "జాజితీగ నాన్నా ... పాదుచేస్తున్నా ... ఎదిగింది ... ఇంక పందిరి వెయ్యాలి" అంది.

సీతా, రామారావు సాభిప్రాయంగా ఒకరికేసి ఒకరు చూసుకున్నారు. తర్వాత నవ్వుకున్నారు. నవ్వి, "అవును అవసరం జాజి ఒక్కదానికే కాదు ... 'అంటూ వాక్యం పూర్తి చెయ్యకుండానే పకపకా నవ్వేశారు. అపర్ణకి అర్థం అయింది. వెంటనే చిరుకోపంతో "పోండి ... మీరు ... మీతో ఆట్లాడను" అంది.

(ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 17-11-2001)

*